# కురూపి

## —చెళ్లూరి సీతారాజేశ్వరరావు

అంబిక సముద్రం స్నానం చేసి వచ్చేసరికి జావకారిపోయింది. మూడు మైళ్ళు నడక, పైగా వుప్పునీటికి తల భారంతో యింటికి రాగానే అలసటగా చాపలో వ్రాలిపోయింది. దాసరథి టిఫిన్ తీసుకురావడానికి బజారుకు పోయాడు. మేనక తడి బట్టలు గోడమీద అరవేస్తోంది. "ఏం చేస్తున్నావే!" అంబిక పిలుస్తూనే రాగం తీసింది. అది మేనకకి వినిపించలేదు.

"ఎక్కడ దిగమారేవే?" తిరిగి విసుగ్గా కేక పెట్టింది.

మేనక భయంగా వచ్చింది. "పిలిచావా వదినా?"

"పిలవకుండా వచ్చే ముఖమా నువ్వు? పాపమ్మగార్ని అడిగి కాసిని మంచినీళ్ళు తీసుకురా. ప్రొద్దుటే గొంతుక తడారి పోతోంది."

మేనక వెళ్ళింది.

అంబికకి ఎప్పటినుంచో అంతర్వేది తీర్థానికి వెళ్ళాలని వుండేది. కాని ఎప్పటి కప్పుడు ఏదో అవాంతరమే. ఈ సంవత్సరం యింటి ప్రక్కవారందరూ బయలుదేరడంతో మొగుడ్ని ప్రయాణం చేయించింది.

"చిన్నాకి రాణీకి పరీక్షలు వస్తున్నాయి కదే!" అన్నాడు దాశరధి.

"ఇంకా నెలకు పైగా వున్నాయి పరీక్షలు. నా పిల్లలు చదవకపోయినా ప్యాసవుతారు. దగ్గరున్న క్షేత్రాలే వెళ్ళి రాలేకపోతున్నాం" అంటూ సణిగింది.

ఇక దాశరధి ఒప్పుకోక తప్పలేదు. పిల్లలు కూడా ప్రయాణమయ్యారు. దాంతో మేనకని కూడా తీసుకురాక తప్పలేదు.

దశమిరోజు మధ్యాహ్నానికే అంతర్వేది చేరుకున్నారు. అప్పటికే బంధువుల యిల్లు జనంతో కిక్కిరిసిపోయి వుంది. దాశరధి మీద గౌరవంతో యింటాయన చిన్న వసారా యివ్వగలిగాడు వీరికి.

అంబికకి తీర్థానికి ప్రయాణమైన సరదా యిప్పుడు లేదు. ఆ జనం రాపిడితో ఆమె వుక్కిరిబిక్కిరయింది.

ఎలాగో రాత్రి కళ్యాణం చూడగలిగింది.

తెల్లవారుఝామునే అంతా సముద్రస్నానానికి తరలి వెళుతున్నారు. అంబిక తను రానంది నడవలేక.

"బాగుంది. యిక రావడం ఎందుకు?" అన్నాడు దాశరధి.

"సముద్రస్నానం చేస్తేగాని పుణ్యం లేవందోయ్!" ఇంటావిడ హెచ్చరించింది. నలుగురూ వెళ్ళడంతో మానలేక 'విధి'గా బయలుదేరింది.

దాశరధి మరచెంబుతో కాఫీ, టిఫిన్ పొట్లాలు తెచ్చాడు. రాణి ఏడుస్తూ తల్లి దగ్గరికి వచ్చింది-తీర్థంలో ఎవరో ఆమె కాలు నొక్కేశారు.

"ఏవని వెళ్ళావ్? అత్తని కొబ్బరినూనె రాయమను?" అంబిక కూతుర్ని ఓదారుస్తూ అన్నది.

"మీరిద్దరూ తీసుకోండి. మేం తిన్నాం అక్కడ. కాఫీలు ఏకంగా పోయించుకు







వచ్చాను" దాశరధి మరచెంబు విప్పుతూ అన్నాడు.

అంబిక టిఫిన్ పొట్లాం విప్పి ఆశ్చర్యపోయింది. "ఇవి ఇడ్లీలా?"

"ఇది అంతర్వేదని మరచిపోకు. పచ్చగడ్డి పచ్చటిచేసి పెట్టినా క్షణాలమీద అమ్ముడయిపోతుంది. ఆకలికి అదే అమృతం."

అంబిక బలవంతంగా తినసాగింది.

"తొందరగా తెమలండి. తీర్థం చూసి వద్దాం" అన్నాడు దాశరధి.

మేనక తయారుగానే వుంది. చెదిరిన ముంగురులను అద్దంలో చూచి సవరించుకుంటోంది.

"తిరిగింది చాలు. ఇంకా ఎందుకులెండి. నాకసలు ఏమాత్రం ఓపిక లేదు" అంది అంబిక బెడ్డింగుమీద తల ఆన్చి పడుకుని.

"ఇంత దూరం వచ్చి యిక్కడ పడుకుందుకా? నడు....మళ్ళీ మళ్ళీ వస్తామా?"

తిరిగి ఆ జనంలోకి పోవడానికి అంబిక సుముఖంగా లేదు. దాశరధి అదిగమనించి బల వంత పెట్టలేదు. "నువ్వు రా మేనకా!"

"ఎందుకది? ఏం చూస్తుంది? మీరు ఎటో వుంటారు. ఏ కొంటె వెధవో దాని మెడలోది త్రెంపుకుపోతాడు."

వదిన వద్దనటంతో మేనక నిరాశపడి పోయింది. తీర్థంలో మట్టిగాజులు, పూసలు, రంగు దారాలు కొనుక్కోవాలని వుబలాట పడింది. 'వెళతాను' అనలేకపోయింది వదిన ముఖం చూసి. అన్నగారికేసి బేలగా చూసింది.

దాశరధికి ఏం తోచలేదు. చెల్లెలిని తీసుకు వెళ్ళాలనే వుంది కాని అంబికతో కొత్తచోట పేచీ పడడానికి అంగీకరించలేకపోయాడు.

"సిగరెట్టు తెచ్చుకు వస్తాను" అని బయటకి తప్పుకున్నాడు.

మేనక ఖాళీగా వుంటే అంబికకి తోచదు.

"విసనకర్ర వుందేమో అడుగు పాపమ్మ గార్ని."

మేనక అసహనంగా వెళ్ళి విసనకర్ర తెచ్చింది.

"తెచ్చి నా ముఖాన తగలెయ్యక్కర్లేదు. కాస్సేపు విసురు. బొమ్మలా తిరిగి రావడానికి నీకే నెప్పి వుండదు. ఏదయినా పని చెప్పేసరికి మూలుక్కుపోతావ్."

చల్లగాలికి నిద్ర పడుతూండటంవల్ల అంబిక దండకం ఆపుచేసింది. ఆమె నిద్ర లేచేసరికి దాశరధి వచ్చాడు.

"భోజనాలు వడ్డించేస్తున్నారు నడవండి."

"మేనకా! వాళ్ళని లేపు" సబ్బు తీసుకుని పెరటిలోకి వెళ్ళింది అంబిక.

వీళ్ళు సత్రము దగ్గరకి వెళ్ళేసరికి యింకా విస్తర్లు వేసే ప్రయత్నంలో వున్నారు.

"వడ్డించేస్తున్నారని చెప్పారు?" భర్తని నిలేసింది.

"నీ ముస్తాబుతో యింకా లేటవుతుందని" దాశరధి నవ్వాడు.

పన్నెండు గంటలు దాటింది. సత్రం జనంతో నిండుగా వుంది. పరిచయస్థులు గుంపులుగా ఏర్పడి తీర్థం విశేషాలు చెప్పుకుంటున్నారు.

"ఎప్పుడొచ్చావు?" సామంతరావు దూరాన్నుంచే పల్కరించాడు.

"నువ్వటయ్యా .... ఈయన ఎక్కడ ఖాళీగా వుందో చూసివస్తానని వెళ్ళారు. ఎక్కడికిపోతే అక్కడే కూర్చుంటారాయె!" అంది అంబిక.

"మీరు చాలా అలసటగా కనిపిస్తున్నారు" ఆమె గుణం తెలుసు కాబట్టి సామంతరావు సానుభూతిగా అన్నాడు.

"ఏం తీర్థమోనయ్యా, పేలాపుగింజలా అయిపోయాను."

దాశరధి రానే వచ్చాడు. "నువ్వు కూడ సత్రముకి రావడమేమిట్రా? అవమానం....అవమానం."

"దీని కమిటీలో నేనూ ఒక మెంబర్ని. రాకపోతే ఒప్పుకుంటారా?"

సామంతరావు స్నేహితుడి కుటుంబాన్ని పందిరిలోకి తీసుకువెళ్ళి జాగా చూపించాడు. భోజనాలయ్యేసరికి రెండయింది.

"ఇంకా వుంటారా?" సామంతరావు అడిగాడు.

"నయం. బస్సుకి వెళిపోతున్నాం" అంది అంబిక.

"అంటే వుండిపోతున్నారన్న మాట."

"అదేమిటి?" దాశరధి అడిగాడు.

"ప్రొద్దుట వెళ్ళినవారికే యింకా టిక్కెట్లు దొరకడం లేదు. ఇప్పుడెళ్ళిన మీకెలా దొరుకుతాయి?"

"పోనీ లాంచీకి పోతాం" అంది అంబిక.

"అక్కడా యిదే తంతు."

"భయపెట్టేయకురా."

"అభయం యిస్తున్నానుకదా! మూడు గంటలకి నా బండిమీద పోదాం."


"ఏం బండి?" చిన్నా వుత్సాహంగా అడిగాడు.

"రెండెడ్ల బండి."

అంబిక నవ్వుతూ అడిగింది "ఎన్ని రోజులకు వెళతాం?"








"మీరు బండి ఎక్కాక నవ్వితే ఒప్పుకుంటాను."

అంబిక సరేనంది. ఇంటికి నడిచారు. పిల్లలు, మేనక సామాను సర్దడంలో నిమగ్నమయ్యారు. దాశరధికి బండిమీద పోవడం యిష్టం లేదు. బస్సు స్టాండుకి పోయివచ్చాడు. ఆ క్యూ చూసి భయపడిపోయాడు. బండి మీద వెళ్ళడమే బాగనిపించింది.

సామంతరావుకి ఏదో పని తగలడంవల్ల బండి బయలుదేరడానికి ఆలశ్యమైంది. ఎండ బాగా తగ్గాక అయిదు గంటలకి బండి బయలుదేరింది. సామంతరావు తొట్టిలో కూర్చున్నాడు. కబుర్లు చెప్పడానికి వీలుగా అంబిక దగ్గర్లో కూర్చుంది. ఆమె పై అంతస్థువారితో ఎంతో స్నేహంగా చొచ్చుకుపోగలదు.

కోడెవయసు గిత్తలు మువ్వల శబ్దంతో బాణంలా దూసుకుపోతున్నాయి. చల్లటి గాలి తగులుతూండడం వల్ల ప్రాణాలు సుఖంగా వున్నాయి.

"ఈ మధ్య మా వూరు రావడం లేదేమిటి?" అంబిక అడిగింది.

"వస్తే రాకుండా వుంటానా? డాబా కట్టడంలో ఖాళీ దొరకడం లేదు."

మలికిపురం వచ్చింది "కాఫీ త్రాగుదామా?" సామంతరావు రోడ్డువార బండి ఆపి అగేడు.

"టిఫిన్‌కి కూడా సిద్ధమే" దాశరధి బండి దిగాడు.

సామంతరావు ఏం కావాలో అందర్నీ అడిగేడు. మేనక తనకేం వద్దంది. ఆమెకి అతడ్ని చూడటమే వెలపరంగా వుంది.

ఎనిమిదింటికి రాజోలు వచ్చారు.

"మీరీ రాత్రికి మా యింటికి రావాలి" సామంతరావు బలవంత పెట్టాడు.

సమాధానం చెప్పవలసిన బాధ్యత తనకు లేదని దాశరధి మాట్లాడలేదు. అంబిక అంగీకరిస్తూ "రేపు మాత్రం వుండమనకుస్మీ. పిల్లల చదువులు పోతాయి" అంది.

బండి పాత పెంకుటింటి ముందు ఆగింది. బండి చప్పుడు విని రావమ్మ తలుపు తీసింది.

"మామ్మా వేడినీళ్ళు పెట్టు ముందర" సామంతరావు పురమాయించాడు.

అందరి స్నానాలు పూర్తి అయ్యేసరికి రావమ్మ వంట పని కూడ పూర్తి కావచ్చింది. వెచ్చటి భోజనం పడేసరికి నిద్ర ముంచుకు వచ్చింది అందరికీ.

"తెల్లవారితే వుండరాయె—కొత్త యిల్లు చూద్దురుగాని రండి."

మేనక కదలలేదు.

పెంకుటింటికి పడమరగా కొత్త డాబా ముస్తాబు చేసుకుంటోంది. కొత్త రంగులు వింత వాసన వేస్తున్నాయి.

"బాగుందయ్యా! గృహప్రవేశం ఎప్పుడూ?" అంబిక అడిగింది.

"వచ్చే నెలలోనే. మీరు తప్పక రావాలి."

వాళ్ళ సంభాషణంలోకి దిగేసరికి దాశరధి, పిల్లలు నిద్రకి ఆగలేక జారుకున్నారు.

"ఇల్లు కట్టావు. ఇంటివాడివికా మరి" అంబిక అన్నది.

"నాకు పిల్లనెవరు యిస్తారండీ?"

అది నిజమే. సామంతరావుకి పాతిక ఎకరాల ఆస్థి వుంది. తల్లీ తండ్రీ లేరు. రావమ్మనే దూరపు బంధువు వండిపెడుతోంది.

అతడికి పాతికేళ్ళు వుంటాయి. నల్లగా వుంటాడు. లావుగా వుంటాడు. బట్టతల. ముఖంమీద మచ్చలు. క్రింద పెదవి లోపలికి త్రోసుకుపోయి వుంటుంది. అతడి ఆస్థికి ఆశపడి కొన్ని బీద సంబంధాలు వచ్చినా అవి అతడికి యిష్టం లేదు.

"మా మేనకని చేసుకో!"

అంబిక మాటలకు విస్తుపోయి చూశాడు.

"కట్నం కానుకలు వుండవు మరి" విషయం పూర్తి చేసింది అంబిక.

"మేనకే నాకు కట్నం" సంతోషం వెలిబుచ్చాడు.

అంబిక భారం తగ్గింది.

## 2

పిల్లిని అడిగి గంట కట్టరు. అంబిక అదే చేసింది ఇంటికి రాగానే. ఆ కుటుంబం యొక్క కళ్ళెం ఆమె చేతిలో వుంది. అందుకే బండి ఆమె యిష్టప్రకారం వెళుతుంది. ఆడపడుచు పెళ్ళి చవకగా అయిపోవడం కావాలి అంబికకి. సామంతరావు సంబంధం ఆ వీలు కల్పిస్తోంది.

ముహూర్తాలు వెదకమని భర్తకు పురమాయించింది.

"సామంతరావుకా?" దీర్ఘంతీస్తూ అన్నాడు.

"ఏం ఏ మహారాజునో తీసుకు వస్తారా? వున్న నాలుగు రూపాయలు చెల్లెలి పెళ్ళికి తగలేసి మాకు చిప్పనిద్దామని వుందా?" కళ్ళెర్ర జేసింది.

"దాన్ని కూడ ఒక మాట అడుగుదాం."

"ఎందుకుట? సామంతరావు సంబంధం మన ముఖాలకి చేదుగా వుందా? లక్ష రూపాయలు కట్నం యిచ్చినా చెయ్యగలమా? మగవాడు ప్రయోజకుడు కావాలా? అందాన్ని కొరుక్కు తింటామా?"

దాశరధి భార్య ముందు కోర్టుకి వచ్చిన కొత్తలాయరులాంటి వాడు. వెంటనే ముహూర్తం పెట్టించాడు. అప్పుడు తెల్సింది మేనకకి.

"వదినా!" బాధగా ఆక్రోశించింది యిష్టం లేనట్లు.

"పిచ్చివేషాలు వెయ్యక. పెళ్ళి మా యిష్టం. మాకు తోచించి చేస్తాం. నీ గొంతెమ్మ కోరికలు తీర్చడానికి మాకు శక్తిలేదు" అంబిక గదమాయించి పడేసింది.

పెళ్ళి ప్రయత్నాలు జరిగిపోతున్నాయి. సామంతరావు పెళ్ళి ఖర్చుకూడా పెట్టుకుంటాననడం అంబికకి తృప్తి యిచ్చింది. అట్టహాసంగా ఏర్పాట్లు చేయించసాగింది.

తల్లిలేని పిల్లయినా మంచి సంబంధం చేస్తోంది.... అన్నారు అంబికవైపు వారు.

"కాకి ముక్కుకి దొండపండు." యితరులు పెదవి విరిచారు.

"కక్కుర్తిపడి చేస్తోంది" అన్నారు గిట్టని వాళ్ళు.

ఎవరేమన్నదీ అంబికకి తెలుస్తోంది. ఆమె మాటలకి భయపడే మనిషి కాదు. తోచిన పని చేసుకుపోవడం ఆమె తత్వం.

పెళ్ళయిపోయింది.

రాత్రి వూరేగింపుకి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముత్యాలపల్లకి తయారయింది. బాణసంచా మ్రోగుతోంది చెవులు చిల్లులు పడేలా.

"మేనకా! తయారయ్యావా?" అంబిక లోపలకి వచ్చింది.

మేనక పడుకుని వుంది. వదిన కంఠం వినిపించినా లేవలేదు. అంబిక మంచం దగ్గరకి



వచ్చింది. "ఇంకా యిలాగే పడుకున్నావా? లే! కూర్చుకో.... అవతలవాళ్ళు వూరేగింపుకు సిద్ధంగానే వున్నారు."

"నా కిష్టం లేదు."

"ఏమయినా పిచ్చి పట్టిందా?" అసహనంగా అరిచింది.

"నాకేం పట్టలేదు" అంది నిర్వికారంగా. నీకేమయినా పట్టిందేమో చూసుకో అన్నట్లు చూసింది.

మేనక ఎదిరించడం ఆశ్చర్యంగా వుంది. అవమానంగా వుంది. ఎప్పుడు ఒదిగి వుండాలో ఆమెకి బాగా తెల్సు. "అలా పేచీ పెడితే ఎలా చెప్పమ్మా! ఇప్పుడు కాదంటే అంతా నవ్వుతారు. ఏ చీర కట్టుకుంటావు చెప్పు?" అనునయంగా అడిగింది.

మేనక మూగనోము పట్టింది.

అంబిక ఆగ్రహం పట్టలేకపోయింది. పిచ్చిగా కేకలు వెయ్యసాగింది. దాశరధి, సామంతరావు వచ్చారు.

"రెండు వీధులు తిరిగి వచ్చేద్దాం చెల్లాయ్" దాశరధి బుజ్జగించాడు.

"నేను రాను."

కొత్త చెల్లెల్ని చూస్తున్నాడు దాశరధి.

"ఆవిడ కిష్టం లేనప్పుడు ఎందుకు? మానేద్దాం" సామంతరావు సమస్యని పరిష్కరించి వెళ్ళిపోయాడు.

"నీలాంటి ముఖానికి ముద్దులు కూడానూ! ఛీ...." అంబిక సాధించసాగింది.

"ఇందాకట్నుంచి అరచి అలసిపోయావు వదినా! పోయి విశ్రాంతి తీసుకో!" అంది మేనక వ్యంగ్యంగా.

అంబిక హతాశురాలయింది. నేల తన్నుతూ కదిలింది.

నవ్వుకుంది మేనక.

ఈ పెళ్ళితో ఆమె కన్నె కలలు చెదిరిపోయాయి. ఇప్పటి దాకా పెళ్ళి ఒక మధురమైన కల. మేనక చదువు హైస్కూలుతో ఆగిపోయినా, నవలలు, సినిమాలనుంచి సంస్కృతి నేర్చుకుంది. తన అందానికో హీరో దొరక్కపోడని ఆమె విశ్వాసం. సామంతరావు భార్య కాకుండా తప్పించుకోవాలని చూసింది. తప్పలేదు. దగాపడిపోవడంతో ఆమెలో విప్లవం రేగింది.

మర్నాడు శోభనం!

అంబిక బలవంతంగా ముస్తాబు చేయించి మేనకని గదిలోకి పంపించింది. సామంతరావు మంచంమీద తాంబూలం నములుతున్నాడు.

భూతంలా కనిపించాడు ఆమెకి. కాలు కదపలేకపోయింది రోతగా. సామంతరావు దిగి దగ్గరగా వచ్చి భుజం మీద చెయ్యి వేసి "ఎందాక నించుంటావు?" అన్నాడు.

విద్యుద్ఘాతంలా తగిలింది ఆమెకి. విదిలించుకుని దూరంగా జరిగి "నన్ను ముట్టుకోవద్దు" కోపంగా అరచింది.

"ఆడవారి మాటలకి అర్థాలు వేరులే!" ఆమెని మంచం దగరికి తీసుకుపోయి త్రోశాడు. మేనక వేగిరం లేచి కూర్చుంది.

అతడికేసి చూడలేకపోతోంది. ఈ మృగం తన భర్తా? ఆ కన్నె హృదయం భగ్గుమంది. పులిపంజా తగిలిన మేకలా వ్యధపడిపోయింది.

"ఈ పెళ్ళి నీకిష్టం లేదుకదూ?" సామంతరావు అడిగాడు.

సమాధానం చెప్పలేదు.

"మీ వదిన బలవంతం చేసిందా?"

....................

"ఎవర్నయినా ప్రేమించావా మేనకా?"

"ఈ చెత్త ప్రశ్నలకి నేను జవాబు చెప్పను. మీరంటే మాత్రం నా కసహ్యం" దిండు, దుప్పటి తీసుకుని మంచం దిగింది.

సామంతరావు చేయి జాపేడు! చీరకొంగు అందింది. మేనక వెనక్కి తిరగకుండా ఎడం పాదం ఎత్తి నిలబడింది. గాజులు, మువ్వల పట్టాలు సంగీతం పాడేయి.

"ఈ అందాన్ని చప్పరిస్తూ కూర్చోమంటావా మేనకా?"

మేనక చీరకొంగు లాక్కుని దూరంగా దుప్పటి వేసుకుని పడుకుంది. సామంతరావు కాస్సేపు ఆలోచనగా వుండిపోయాడు. మేనక

అందం అందని మిఠాయిలా వుంది. నెమ్మదిగా లేచి ఆమె దగ్గర కెళ్ళాడు. శోభనం ముస్తాబుతో శోభాయమానంగా వుంది మేనక. ఆమె అందం అలంకరణతో ద్విగుణీకృత మైంది.

నది గట్టుమీద వున్న చెట్టుయొక్క పువ్వు నీళ్ళపై పడి ప్రవాహంపై ప్రయాణించడంలో గల సుందరత మేనకలో వుంది. సంధ్య వెలుగులో తొలకరి వరిచేల సముదాయం యొక్క కాంతి మేనకలో వుంది. వర్షరుతువు లోని వెన్నెల రాత్రి కదలాడే మేఘం యొక్క తీక్షణత ఆమెలో వుంది.

వాటికి వారసుడుగా, భర్తగా కోరుకోవడం సామంతరావు తప్పు కాదు. నడుంమీద చెయ్యి వేశాడు. రివ్వున లేచింది. "నన్ను ముట్టుకో వద్దని చెప్పాను. మీ వునికి భరించడం నా వల్లకాదు. ఈసారి మీ స్పర్శ తగిలితే ఈ చీరతోనే వురి పోసుకుంటాను."

"మేనకా!" సంభ్రమంగా అన్నాడు.

"దయచేసి వెళ్ళండి."

"ఆల్‌రైట్! నువ్వు నా భార్యవి. బలవంతంగా అనుభవించవల్సిన అవసరం లేదు నాకు." సామంతరావు మంచందగ్గరకి వెళ్ళి పోయాడు.

పదిరోజులు గడిచాయి.

పూర్వం యింటి పని అంతా మేనకది. అంబిక కేవలం పైపెత్తనం చేసేది. పెళ్ళయి నప్పటినుంచి మేనక ఏ పనిచెయ్యడంలేదు. అంబిక చెయ్యమన్నా "చేసినన్నాళ్ళుచేశాను. దానికి మంచి బహుమానం దొరికింది. ఇంకా నీకేందుకు చాకిరీచెయ్యాలి వదినా?" నీలేసి అడిగింది ఒకసారి.

అంబిక నోర్మూసుకుంది. మేనకతో మాట్లాడటమే భయంగావుంది. పిల్లి పులయి పోయింది.

"నీ పెళ్ళాన్ని తీసుకుపో!" సామంతరావుకి వుత్తరం రాసింది.

వారంరోజుల్లో సామంతరావు వచ్చాడు. మేనక ప్రయాణానికి సుముఖంగానే వుంది. ఆమెకీ యిక్కడ వుండాలని లేదు.



"వుత్తరాలు రాస్తూండమ్మా" బండిదగ్గరకి వచ్చి వీడ్కోలుగా అంది అంబిక.

"ఎవరికి రాయను?" అనడిగింది రుషగా. అంబిక చిన్నబోయింది.

బస్సుఎక్కాక అడిగాడు సామంతరావు. "మీవదినమీద కోపం పోలేదా?"

"నాకు చేసిన ద్రోహానికి....పోదు."

ఇంటికి వచ్చేసరికి నాలుగయింది. పోలం అత్యవసరంగా వెళ్ళవల్సివున్నా భార్య మోజులో సామంతరావు కదలలేదు.

మేనక తలంటుకుని డాబాపై చిక్కుతీసు కుంటోంది. సామంతరావు కుర్చీ తెచ్చుకుని ఆమె దగ్గరగా కూర్చున్నాడు. మేనక మాట్లాడ లేదు. సామంతరావు పైమరో భావం కలగడం లేదు ఆమెకి.

రాత్రి భోజనమయ్యాక నిద్రవస్తున్నా బల వంతంగా కూర్చుంది. నిద్రపోతే సామంతరావు ప్రక్కన పడుకుంటాడని.

"భయపడకు. నీలా నేనూ మాటకి నిలబడే వాడ్నే. డాబామీద గదిలో పడుకుంటాను. తలుపేసుకో!"

అంతరంగంలో రవంత సానుభూతి రేగింది మేనకకి. కాని అది తాత్కాలికం.


"నువ్వు గ్రీన్ సిగ్నల్‌యిచ్చే రోజు రావాలని ఆశ." తలుపు సందునుంచి ఆమెని చూస్తూ నవ్వాడు.

రోజులు గడుస్తున్నాయి. అంబిక లేక పోవడం మేనకకి సుఖంగానే వుంది. ఈనాడు స్వేచ్ఛాజీవి. సామంతరావు రూపాయిలతో చేయతగ్గ సదుపాయాలన్నీ భార్యకి చేశాడు. ఇంటిపనికి రావమ్మ వుంది, నౌకర్లున్నారు. భర్తకురూపితనం తప్ప మేనకకి యితరసమస్య లేం లేవు.

ఓసారి దాశరథి, అంబిక వచ్చారు కొత్త కాపురం చూడడానికి. మేనక అన్నగారితో పొడిగా నాలుగు మాటలు మాట్లాడింది. అంబికని పల్కరించలేదు.

"దాన్ని అందలం ఎక్కించానుకదూ....అదే పగ." అక్కసున్సుగా అంది అంబిక.






"రేపు రాణికికూడ డబ్బున్న ముసలి వెధవ సంబంధంచెయ్యి. అందలం అంటే ఏమిటో నీ కూతురు చెబుతుంది." పెడీలమని జవాబిచ్చింది.

అంబిక, నీగుమ్మం ఎక్కితేచూడు అంటూ వెళ్ళిపోయింది.

రెండు నెలలు గడిచాయి. భార్యాభర్తలు వేర్వేరుగా పడుకోవడం రావమ్మకి అర్థంకాలేదు. మేనకని అడిగే ధైర్యంలేక సామంతరావుని అడిగింది.

"నువ్వు మునిమనుమల్ని ఎత్తితే ఎక్కడ గుటుక్కుమంటావోనని జాగ్రత్తపడుతున్నాం." సామంతరావు నవ్వాడు.

## 3

మేనకకి ఆ రోజు చాలా చిరాగ్గావుంది. ఏం తోచడంలేదు. సాయంత్రందాకా విసుగ్గా గదిలోనే కాలక్షేపం చేసింది. అయిదున్నరకి సినిమాకి బయలుదేరింది. ఆమె గుమ్మాలు దిగుతుండగా పొలంనుంచి సామంతరావు వచ్చి "సినిమాకా?" అనడిగాడు. తలూపింది.

"నేనూ వస్తానపద. సినిమాచూసి చాల రోజులైంది."

మేనక ముఖం మాడ్చుకుంది. రిక్షాదొరక లేదు. నడవసాగేరు. అది చిన్నసందుకాబట్టి అరుగులమీద మహిళామండలుల దృష్టి వీరి మీద పడింది. నవ్వుకున్నారు. మేనకకి తల కొట్టేసినట్లయింది. అవమానంతో వేగి పోయింది. వాళ్లు తనని గురించి ఎలా అప హాస్యంగా మాట్లాడతారో వూహించసాగింది.

దారిలో స్నేహితుడు కనిపిస్తే మాట్లాడుతూ సామంతరావు ఆగిపోయాడు. మేనక ఆగలేదు. అతడు ప్రక్కన నడవడం ఆమె సహించలేక పోయింది.

పోస్టాఫీసుదగ్గర ఒక యువకుడు సూట్‌స్‌తో ఎదురయ్యాడు. మేనక చప్పున పోల్చేసుకుంది.

"బావా!" చప్పట్లు కొట్టింది.

"నువ్వా మేనకా! .... మీ యింటికోసమే యిందాకట్నుంచి వెతుకుతున్నాను. నా అదృష్టం నువ్వే కనిపించావు." శివగిరి దగ్గరికి వచ్చాడు.

"అంత వెతకవలసిన పట్టణం కాదే.... ఎప్పుడొచ్చావ్?"

"ప్రొద్దుట. నాకీ వూరు ట్రాన్స్‌ఫర్ అయింది."

వెళుతున్న రిక్షాని పిలిచింది. ఇంతలో సామంతరావు దగ్గరకి వచ్చాడు. "మా బావ" అని పొడిగా పరిచయం చేసింది. "ఇంటికి వెళదాం రిక్షా ఎక్కు."

"మీరు ఎక్కడికో బయలుదేరినట్లున్నారు" సంశయంగా అడిగాడు.

మేనక, శివగిరి రిక్షా ఎక్కగానే ఎక్కి కూర్చుని "సినిమాకేలే..........ఎప్పుడైనా చూడొచ్చు" అంది.

వెళుతున్న రిక్షాకేసి చూస్తూ నిలబడి పోయాడు సామంతరావు.

ఆమె చొరవ శివగిరిని ఆశ్చర్యపరిచింది. "మీ ఆయన ఏమైనా అనుకోడూ?"

"అనుకోనీ" మేనక నవ్వింది. శివగిరి రాక ఆమెకి థ్రిల్లింగ్‌గా వుంది. దూరదేశంలో శత్రువుకూడ ప్రాణస్నేహితుడిలా కనిపించి నట్లు, పూర్వం ఘనమైన పరిచయం లేక పోయినా శివగిరి విలువ పెరిగిందినాడు ఆమె దృష్టిలో.

ఇదేం శివగిరికి తెలీదు.

తన భర్తతో పోల్చి చూసుకుంది. శివగిరి గొప్ప అందగాడు. డాషింగ్ పెర్సనాలిటీ! ఆరాధనం దీనికే పెరుగుత.

టిఫిన్, టీ తీసుకుని కూర్చున్నాడు శివగిరి. వంట పురమాయించడానికి మేనక లోపలకి వెళ్ళింది. ఇంతలో సామంతరావు వచ్చాడు. శివగిరి ఉలిక్కిపడ్డాడు. మేనక చేసిన దానికి గొడవ జరుగుతుందని భయపడ్డాడు.

సామంతరావు దగ్గర కూర్చుని ఆప్యాయంగా మాట్లాడాడు. "ముందర స్నానం చేసెయ్యండి. రిలీఫ్‌గా వుంటుంది."

"వద్దండీ. లాడ్జింగ్‌లో వుంటాను" శివగిరి ముఖమాటం పడ్డాడు.

సామంతరావు నవ్వాడు. "మా యిల్లు బాగాలేదా?"

మేనక వచ్చి సూట్‌కేస్ లాక్కుంది. "అక్కయ్య వచ్చేవరకు నీ బస యిక్కడే. మాట్లాడితే మర్యాద దక్కదు."

ఈ లాగటంలో ఆమె స్పర్శ తగిలి శివగిరి వళ్ళు ఝల్లుమంది. మేనక అందాన్ని తప్పించుకుని పోదామని అతడికీ లేదు. గౌరవం కోసం అన్నాడు.

ఎనిమిదిన్నరకి భోజనాలయినాయి. మేనక శివగిరి చూపిస్తున్న ఆల్బమ్ చూసి పరవశంగా నవ్వుతోంది. సామంతరావు డాబాకేసి వెళుతూ చూశాడు. ఆగేడు. శివగిరి ఇతడ్ని చూశాడు. సామంతరావు పైకి వెళ్ళిపోయాడు.

"మీ శ్రీవారు నీకోసం చూస్తున్నారు" శివగిరి అన్నాడు.

"నా కోసం కాదులే! అన్నట్లు అక్కయ్య ఎప్పుడు వస్తుంది?" అంది సంభాషణ దిశ మారుస్తూ.కుర్చీలో వెనక్కి వ్రాలి కాళ్ళు మంచానికి తన్ని కూర్చుంది.

ఆమె కాళ్ళు ఆడించడంలో మువ్వలు కదులుతున్నాయి. చీర లంగా గాడి తప్పుతూ నగ్నతకి ఆస్కారమిస్తున్నాయి.

శివగిరి కిదంతా ఇంద్రజాలం చూస్తున్నట్లుంది. మేనక యిలా ఎందుకు ప్రవర్తిస్తోంది? ఆమె సంసారంలో అపశృతులు వున్నాయా? అసంతృప్తి దాగుందా?

"నిద్ర వస్తోందా?" మేనక అడిగింది.

"లేదు."

"సినిమాకి వెళదామా? బాపు సినిమా మిస్ కావాలనిపించలేదు నాకు."

శివగిరి ఏదో అనబోయి మానేసి బట్టలు వేసుకున్నాడు. రావమ్మని తలుపేసుకోమని మేనక అతడితో సినిమాకి బయలుదేరింది.

మధ్యలో కరెంటు పోతూండటంవల్ల రెండవ ఆట వదిలేసరికి నాలుగయింది. మేనక మర్నాడు లేచేసరికి తొమ్మిదయింది. శివగిరి ఆఫీసుకి వెళ్ళిపోయాడు. రావమ్మ, ముఖం కడుక్కున్నా కాఫీ పట్టుకురాకపోవడం చూసి మేనక వంటింటిలోకి వెళ్ళింది.

సామంతరావు పెరటి అరుగుమీద పనస్ కాయ కొడుతున్నాడు.


"కాఫీ పెట్టలేదా?" విసుగ్గా అడిగింది.

"ఎప్పుడు లేస్తావో ఎవరికి తెలుసు? పెడతానాగు....రాత్రి సినిమాకేనా వెళత?" రావమ్మ అప్రసన్నంగా అడిగింది.

"నీకు చెప్పాలా?" మేనక కుతకుతలాడిపోయింది.

రావమ్మ తాటాకు మంటలా లేచింది.






మేనక విచ్చలవిడితనం ఆమెకు నచ్చడంలేదు. రాత్రి బావతో సినిమాకిపోవడం సంప్రదాయాల మధ్య పెరిగిన రావమ్మ భరించలేకపోతున్నది.

"నాకు కాకపోతే లోకానికేనా చెప్పాలే! మొగుడ్ని వదిలేసి దారేపోయే దానయ్యతో సినిమాకి వెళతావా? సంసారం చేసుకునే మనిషివే?"

"దారేపోయే దానయ్యేం కాదు. నా బావ."

"నీ మొగుడికంటె ఎక్కువ?" రావమ్మ హూంకరించింది.

సామంతరావు గాంభీర్యం, రావమ్మ ఉద్రేకానికి మేనక భయపడిపోయింది. కాని, సమర్థించుకుంటూ "సినిమాకి వెళితే యింత గోల చేస్తావేమిటి?" అన్నది కోపంగా.

"ఇంకా పెద్దగోలచేసి మమ్మల్ని నవ్వులపాలుచెయ్యకుండా!" రావమ్మ గుమ్మం దగ్గరకి వెళ్ళి "బెల్లంకొట్టిన రాయిలా మాట్లాడవేంరా? నువ్వు ముందరే జాగ్రత్తపడటం మంచి దబ్బాయ్!" అంది సామంతరావుతో.

"మేనక మూర్ఖురాలు కాదని నా నమ్మకం" సామంతరావు భార్యకేసి చూసి నెమ్మదిగా అన్నాడు.

వ్యక్తిజనితమైన జీవితం ఎప్పటికప్పుడు తన దిశను మార్చుకుంటూ వుంటుంది. మార్పుకి స్వాగతం చెప్పేవాడు వివేకి. ఎదిరించేవాడు విప్లవవాది. వివేకి అశాంతి నుంచి శాంతి పొందాలనుకుంటాడు. విప్లవవాది అశాంతినే శాంతి చెయ్యాలనుకుంటాడు. అది సవనం. ఇది సమరం.

సామంతరావు వుద్రేకి కాడు.

భార్య తనని ద్వేషిస్తూందని తెల్సు. అదే నిష్పత్తిలో తను ప్రేమిస్తున్నాడు. శాసిస్తూ ఆమెని పొందేకంటె, ఐచ్ఛికంగా తను కోరబడడం కోరుకుంటున్నాడు.

సాయంత్రం శివగిరి ఆఫీసునుంచి వచ్చేసరికి మేనక ఒంటరిగా పెరట్లో ట్రాన్సిస్టర్ వింటూ కూర్చుంది. రావమ్మ గుడికి వెళ్ళింది.

"అలావున్నావేమిటి? రాత్రి సినిమాకి వెళ్ళినందుకు మీ ఆయన తిట్టేడా?"

"ఆయనేమనలేదు. ఆ ముసలిముండ నోరు పడేసుకుంది."

"మంచిమనిషిలా వున్నాడు."

"చేతకాని వాజమ్మను."

రోజులు గడుస్తున్నాయి. మేనక యిస్తున్న ప్రోత్సాహానికి శివగిరికి బెదురు పోయింది. ఆమె బాత్‌రూంలో వున్నా తలుపు కొట్టి

మాటాడగలడు. తడిసిన వంటిమీద అర్ధ నగ్నంగా మేనకని చూడడం అతడికి చాలా యిష్టం. ఈ మోజులోపడి భార్యా పిల్లలని తీసుకురావడం మరచిపోయాడు.

ఏదో పండగ వచ్చింది. సామంతరావు భార్యకి రెండు ఖరీదైన చీరలు కొన్నాడు. పండగరోజున ఆమె మరో చీర కట్టుకోవడం చూసి "ఇదెక్కడిది?" అనడిగాడు.

"మా బావ కొన్నాడు."

"నువ్వంటే చాలా యిష్టం కాబోలు."

"నాకూ యిష్టమే!"

"ఎలాంటి యిష్టం!"

మేనక చెప్పలేకపోయింది. అక్కడ్నుంచి కదలడానికి హడావిడిగా చెప్పులు తొడుక్కుంది. కుడి ఎడమలు తారుమారయ్యాయి. గమనించక అవస్థపడింది.

"విలువలు తారుమారయినా కష్టమే మేనకా!"

వారంరోజులు గడిచాయి. శివగిరి భార్య యిక వుత్తరాలు రాయడం మాని "బుధవారం వస్తున్నాం" అని వైరిచ్చింది. శివగిరిలో చలనం బయలుదేరింది.

"అద్దెయిల్లు అర్జంటుగా చూడాలి. అర్థాంగి వచ్చేస్తోంది." మేనకతో ఫిర్యాదు చేశాడు.

"మంచిదేగా?"

"ఏం మంచి? రెండ్రోజుల్లో యిల్లెందొరుకుతుంది?"

"నాకు వదిలెయ్!"

మేనక పాలేర్లకి పురమాయించింది. నాలుగయిదు ఇళ్ళ వివరాలు పోజేసుకుని వచ్చారు. మేనక యింటికి అవతల వీధిలో వున్న యిల్లు నచ్చింది. అడ్వాన్స్ యిచ్చారు. బుధవారం వచ్చింది. లారీలో సామాను వచ్చింది. శివగిరి భార్య వంట్లో బాగాలేక రాలేదు.

రావమ్మ తనతో ఘర్షణపడుతున్నా మేనక తన పద్ధతులేం మార్చుకోలేదు. వాస్తవానికి ఆశలకి మధ్య దారి వెతుక్కుంటూంది. ఏ తీరం చేరుకోవాలో నిర్ణయానికి రాలేకపోతున్నది. భర్త కురూపితనం బాధిస్తోంది, బావ అందం మరిపిస్తోంది. యవ్వనం ఎదురుగాలిలోని పడవలా భారంగా వుంది.

శివగిరి మాత్రం యిల్లు చూసినప్పటి నుంచి యిక్కడికి రావడం లేదు. రావమ్మకి భయపడుతున్నాడు. రావమ్మ మేనక లేకుండా యిష్టమొచ్చినట్లు తిట్టిపోసేది. దాంతో అభిమానం నిద్రలేచింది. మరోవైపు సామంతరావు వ్యక్తిత్వం సవాల్ చేస్తోంది... రాకపోకలు పూర్తిగా తగ్గించాడు.

మేనకే రెండు మూడు సార్లు వెళ్ళివచ్చేది. ఆమె ఎక్కడికి వెళుతూందో రావమ్మకి తెల్సు. రాగానే పోటాడేది. సామంతరావు మాట్లాడేవాడు కాదు. పిల్లలు విలువైన రత్నాలని వదేసి గాజు ముక్కలకోసం ఆరాటపడతారు. మేనక అలాగే కనిపించింది.

ఒకనాడు పన్నెండు గంటల సమయం.... ఎండలేదు....మబ్బుగావుంది....మేనక భోజనం చేసి వరండాలోకి రాగానే ఓ కుర్రాడు పరుగున మీద వచ్చి చీటీ యిచ్చాడు.

"తొందరగా రా............గిరి...."

ఎందుకోనని వెళ్ళింది వెంటనే. శివగిరి ఓ పుస్తకం యిచ్చి "దీన్ని చూస్తూ వుండు.... సిగరెట్లు తెచ్చుకువస్తాను" చిన్నగా నవ్వి బయటకి వెళ్ళిపోయాడు.

మంచంమీద పడుకుని పుస్తకం తెరిచింది. సెక్స్ అట్లాసు. రకరకాల నగ్న చిత్రాలు. మేనక వయసు నిద్రలేచింది. శరీరమంతా తిమ్మిరితిమ్మిరిగా వుంది. తదేకంగా చిత్రాలు చూసేకొద్దీ యవ్వనం తాండవనృత్యం చెయ్యసాగింది.

శివగిరి వచ్చాడు. గడియ వేశాడు. నిట్టూర్పులతో మేనక. ఎన్నాళ్ళనుంచే కలయిక కోసం ఎదురుచూస్తున్నాడు. మేనక ఎదురు చెప్పదని తానే చొరవచేశాడు. మంచం దగ్గరకి వచ్చాడు. వక్షాలు ఎగురుతున్నాయి ఆవేశంగా. మంచం వారగా కూర్చున్నాడు. ఆమె చేతిని మెల్లగా నొక్కాడు.

మేనక వులిక్కిపడింది.

ఎదురుతిరగాలని వుంది. తిరగరాదని వుంది.

తలుపు చప్పుడయింది.



శివగిరి విసుక్కుంటూ లేచాడు. తలుపు దగ్గర కెళ్ళేసరికి భార్యని తెలిసిపోయింది. మైకం వదిలి భయం పట్టుకుంది.

పెరటి తలుపు తీసి "రాధ వచ్చేసింది మేనకా! నువ్విలా వెళ్ళిపో ప్లీజ్!" నెమ్మదిగా గొణిగాడు.

"రానీ! నేను పారిపోవడమెందుకు?"

"అది అసలే అనుమానం మనిషి. ఇల్లు పీకి పందిరి వేస్తుంది...." మేనక రెక్కపుచ్చుకుని గుమ్మంకేసి లాక్కెళ్ళి "తర్వాత చెప్తాగా" అన్నాడు తలుపు వేస్తూ.

దొంగలా పారిపోవడం మేనకకి అదోలా వుంది. అవమానంగా వుంది.

తను బాహాటంగా అందర్నీ ఎదిరించి అతడి దగ్గరకి వెళుతోంది. శివగిరి తన కోసం సాహసం ఎందుకు చేయడు! తన వాళ్ళతో ఎందుకు పోరాడడు?

ప్రశ్నలు ఆమెని నిలదీశాయి.

## 4

"అయ్యగారు పిలుస్తున్నారమ్మా" పని మనిషి వచ్చి చెప్పింది.

మేనక అదోలా చూసింది. ఒకే కప్పు క్రింద వున్నా ఎవరి ప్రపంచం వారిది. ఒకర్ని ఒకరు ఎదురయితే మాటాడుకోవడంతప్ప పిలుపులు లేవు. మేనక అయిష్టంగానే లేచింది.

"ఇతడు నందకుమార్. నా స్నేహితుడు. ఇతడి సినిమాలు నువ్వు చూస్తూనే వుంటావు" భార్య రాగానే పరిచయం చేశాడు.

సినిమా పక్షి అని తెలియగానే మేనకకి వుత్సాహం వచ్చింది. "మిమ్మల్ని కల్సుకోవడం చాలా ఆనందంగా వుంది" అంది ఎదురుగా వున్న సోఫాలో కూర్చుంటూ.

"ఒరేయ్ నందం....నేను లేనని నువ్వేమీ సిగ్గుపడక్కర్లేదు. మేనక అన్ని విషయాలు చూసుకుంటుంది. నువ్వు వచ్చినట్టే, నాకు విశాఖ ప్రయాణం తప్పనిసరయింది" సామంతరావు బాధగా అన్నాడు.

"పోన్లేరా....మళ్ళీ వస్తాను...." అన్నాడు నందకుమార్.

"అదేం వీల్లేదు.........నాకంటె ఎక్కువగా మేనక సాయపడుతుంది" అంటూ భార్యకేసి తిరిగి "ఏం మేనకా?" అన్నాడు.

"ష్యూర్!"

మధ్యాహ్నం భోజనం అయ్యాక సామంతరావు విశాఖ వెళ్ళిపోయాడు. పడుకున్నా మేనకకి నిద్ర పట్టలేదు. నందకుమార్ గదికి వెళ్ళింది.

నందకుమార్ సిగరెట్టు కాలుస్తూ ఏవో కాగితాలు చూసుకుంటున్నాడు. మేనక గుమ్మం దగ్గర తచ్చాడడం చూసి "రండి" అన్నాడు.

"టీ తీసుకుంటారా?"

నందకుమార్ తలూపాడు. మేనక పని మనిషికి పురమాయించి లోపలకి వచ్చి కూర్చుంటూ "మా వారికి మీలాంటి స్నేహితులుండటం ఆశ్చర్యంగా వుంది" అంది నవ్వుతూ.

విస్మయంగా చూశాడు నందకుమార్.

"ఇప్పటిదాకా యెన్ని సినిమాలు డైరెక్టు చేశారు?" సంభాషణ మారుస్తూ అడిగింది.

"సంఖ్యలో స్వల్పమేనండి. తొమ్మిది."

"మీ పేరయ్య సంసారం చాలా సహజంగా వుంది. పల్లెటూర్లో ఒక సామాన్య కుటుంబాన్ని చూస్తున్నట్లు వుంది. తెలుగు సినిమాలకి కూడ జాతీయ బహుమతులు వస్తాయనిపించింది."

"అందుకే నాకూ మరిన్ని కొత్త ప్రయోగాలు చెయ్యాలనిపిస్తోంది. అందుకే స్వంత ప్రొడక్షను పెట్టాను. గోదావరి తీరంలో షూట్ చేద్దామని యిలా వచ్చాను."

"హీరో హీరోయిన్లు ఎవరు?"

"ఈసారి కొత్తవాళ్ళతో తీద్దామని వుంది."

మేనక ఆశ చిగురించింది. ఆమెకి ఎప్పటి నుంచో సినిమాల్లో నటించాలని వుంది. తనకి అందం వుంది. ఆ క్వాలిఫికేషన్ చాలనుకుంటోంది.

మర్నాడు నందకుమార్, మేనక 'లొకేషన్ సెర్చి'కి బయలుదేరుతూండగా శివగిరి ఉత్తరం పంపించాడు. మేనక అది చదివి చింపి

ఇప్పుడు ఖాళీ లేదని చెప్పు' అంటూ కారెక్కి కూర్చుంది.

శివగిరి సాయంత్రం నుంచి మేనక యింటి ముందు కాపలా కాస్తున్నాడు. తొమ్మిదింటికి మేనక వచ్చింది. ప్రయాణం మూలంగా అలసటవల్ల వెంటనే స్నానానికి వెళ్ళిపోయింది మాట్లాడకుండా. శివగిరిలో కోపం తొంగిచూసింది. నందకుమార్‌తో తిరగడమే అతడికి మంటగా వుంది.

రావమ్మ భోజనాలకి పిలవడంతో "నువ్వు కూడా లే!" కుర్చీలో బిగిసికూర్చున్న శివగిరితో అంది.

"నాకు ఆకలి లేదు."

నందకుమార్ అక్కడికి రావడంతో "మా బంధువు" అంటూ పరిచయం చేసి లోపలికి వెళ్ళిపోయింది.

మేనక ముభావంగా వుండటంతో శివగిరికి అక్కడ వుండాలనిపించలేదు. అసహనంతో వెళ్ళిపోయాడు.

మేనకని యింటికి రప్పించుకోడానికి భార్యని బలవంతంగా పెళ్ళికి పంపించాడు శివగిరి. తనని కాదనడంకంటె, మేనక నందకుమార్‌తో తిరగడం భరించలేకపోతున్నాడు.

## 5

నందకుమార్‌కి నాలుగురోజుల్లో లొకేషన్లు తిరిగిరావడం అయింది. రేపే అతడి ప్రయాణం.

"వీడు చూశారా? రెండ్రోజుల్లో వస్తానన్నాడు. ఇప్పటిదాకా రాలేదు" భోజనాల దగ్గర అన్నాడు నందకుమార్.

భర్త ప్రసక్తి రావడంతో మేనక కుదించుకుపోయింది.

భోజనాలు అయినాయి. నందకుమార్ కారిడార్లో పచార్లు చేస్తున్నాడు. "ఇదిగో వక్కపొడి" మేనక వచ్చింది.

"మీ ఆతిథ్యానికి ధన్యవాదాలు మేనకగారూ! మీ కోపరేషన్‌వల్ల నా పని విజయవంతంగా ముగిసింది."

మేనక మందహాసం చేసింది. "మిమ్మల్ని ఒకటి అడగాలనుకుంటున్నాను" అంది చాలాసేపటి తర్వాత.

"అడగండి."

"మీ కొత్త పిక్చర్‌లో నాకు స్థానం యివ్వండి."

"మీకా!"

"నేను పనికిరానా?" విలాసంగా తన సౌందర్యం చూసుకుంటూ అడిగింది.

"ఎందుకు పనికిరారు? మీరు సినిమాల్లో ఎందుకు చేరాలనుకుంటున్నారు? గ్లామర్ కోసమా? అదేం పూలపాన్పు కాదు. ముళ్ళ కిరీటం."

మేనక మాట్లాడలేదు.

"మీకు ఐశ్వర్యం వుంది. చల్లని కాపురం వుంది. ఇంతకంటె తృప్తిగా వుండదు అక్కడి జీవితం? అయినా సామంతరావు ఒప్పుకుంటాడా?"

మేనక చివాలున తన గదిలోకి వెళ్ళిపోయింది. నందకుమార్ విభ్రాంతిపడి ఆమె వెంట వెళ్ళాడు. మేనక మంచం అంచుపై భారంగా కూర్చుంది.

"క్షమించాలి నేను పొరపాటుగా మాట్లాడానా?"

మేనక ముఖం చీరకొంగుతో వత్తుకుంటూ "కూర్చోండి. మీకు కొన్ని విషయాలు చెప్పాలి. నాకీ కాపురం యిష్టంలేదు" చెప్పింది.

"వాట్!" నందకుమార్ ఆశ్చర్యంతో సోఫాలో కూర్చున్నాడు.

"అవును. భర్త కురూపి. అది నేను భరించలేకపోతున్నాను. మీరయినా నన్ను యిక్కడ్నుంచి దాటించండి" అంది వెక్కివెక్కి ఏడుస్తూ.

నందకుమార్ ధైర్యం చెప్పాడు. పెళ్ళయినప్పటి నుంచి తన జీవనం అతడికి విశదీకరించింది.

వీరు మాటలాడుకుంటూండగా శివగిరి క్రిందకి వచ్చాడు. పనిమనిషి డాబామీద వున్నారని చెప్పింది. శివగిరి మెట్లు యెక్కాడు.





తలుపులు దగ్గరగా వేసివున్నాయి. తన వస్తువు దూరమయిపోయినట్లు బాధ రేగింది అతడిలో.

"తప్పకుండా మిమ్మల్ని హీరోయిన్ చేస్తాను."

శివగిరి ఆ మాటలకి కుతకుతలాడిపోయాడు. వీడు సాయం చేస్తున్నాడంటే మేనక ఏదో యిచ్చివుండాలి. ఉత్తుడియంగా సాయం చెయ్యడు కదా! మేనక తన చేతుల్లోంచి జారిపోయి నందకుమార్ సొత్తుకావడం గుండెలు పిండినట్లయింది.

"నువ్వు ఆడదానివే...." విసురుగా తలుపుల త్రోసి లోపలకి వెళ్ళాడు.

ఇద్దరూ వులిక్కిపడ్డారు.

"పరాయి మగాడితో పట్టపగలు పడక గదిలో సరసాలాడతావా?" కోపంగా ఆమెను లాగేడు.

మేనక విదిలించుకుంది, "నా యిష్టం. గెటవుట్. నా మీద పెత్తనం ఏమిటి?" గద్దించింది.

"పొమ్మనవూ. నేనుంటే అడ్డుకదా!" వికటంగా నవ్వాడు.

నందకుమార్ జోక్యం చేసుకున్నాడు. "మిస్టర్ మర్యాదగా మాటలాడ ం నేర్చుకో. ఆవిడ్ని శాసించడానికి నువ్వెవరు?"

"అది బరితెగించిన రకం. నీకయినా సిగ్గు లేదటయ్యా." ఆవేశంగా శివగిరి అతడి మీదకి వెళ్ళాడు.

మేనక రోహిణీ సూర్యుడయింది. నిప్పుల కుంపటయింది. శివగిరి ప్రవర్తనకి వుడికిపోయింది. డాబా పిట్టగోడ దగ్గరకెళ్ళి క్రిందనున్న నౌకర్లని పిలిచింది. వాళ్ళు వచ్చారు.

శివగిరిని చూపిస్తూ "ఈ వెధవని బయటకి గెంటండి" ఆదేశించింది.

పరిస్థితి మారుతోందని శివగిరి గ్రహించాడు. "మేనకా! నన్ను తప్పించుకోలేవు. ఎలాగయినా నిన్ను పొంది తీరతాను"

శివగిరి వెళ్ళాడు. మేనక అచేతనంగా కూర్చుంది. వేడిగా వుంది మనసు.

"మీ మీద ఆయనకి చాలా అధికారమున్నట్లుంది. అవునా?"

"స్వార్థపరుడని తెలియదు. అతడి అందానికి భ్రమపడ్డాను."

నందకుమార్ గదిలో పచార్లు చెయ్యసాగేడు మాటాడకుండా. పదినిముషాలయింది. నిశ్శబ్దాన్ని చీలుస్తూ అన్నాడు. "చూశారా! అందమైన వారికి అందమైన మనసుండదు."

మేనక వులిక్కిపడింది. మంచుముక్కలు మీద పడినట్లు జిలజిలలాడింది.

"మీ మీద ఎంతో నమ్మకముంది సామంతరావుకి. నన్ను అప్పగించి వూరికి వెళ్ళాడు. మీ బావ మనం మాటలాడుకోవడమే భరించలేకపోయాడు. ఇద్దరికీ ఎంత తేడా?"

మేనక బాపురుమంది. నందకుమార్ ఓదార్చలేదు.

రాత్ర ఎనిమిది గంటలకి సామంతరావు వచ్చాడు. భోజనాలయ్యాక అర్ధరాత్రిదాకా మిత్రులిద్దరూ ఏవేవో మాటాడుకున్నారు.

"గుడ్‌నైట్....నీ కాలాన్ని పారించలేను" నందకుమార్ తన గదికి పోయాడు.

సామంతరావు తన గదిలోకి వచ్చి స్థాణువైపోయాడు. రోజులాలేదు గది. మల్లెలున్నాయి! సుగంధాలున్నాయి! మేనక వుంది.

"మీరు కాదు కురూపి. నేనే కురూపిని. మాణిక్యాన్ని వదిలి గాజుముక్కకోసం పరుగెత్తాను. నన్ను క్షమించండి" అంది అతని వడిలో వ్రాలి.

అది వసంత రాత్రయింది వాళ్ళకి. తీయతీయని సమయంలో గతాన్ని సమాధి చేసుకుని, ఆనందజ్యోతులు వెలిగించుకున్నారు.

"నాకు సినిమాల్లో వేషం వద్దు కుమార్ గారూ! సామంతరావుగారి యిల్లాలు వేషం చాలు నాకు!" మర్నాడు మేనక చెప్పేసింది.

★